


భారత రాజ్యాంగం అమల్లోకి వచ్చి 75ఏండ్లు పూర్తిచేసుకున్న సందర్భంగా కర్తవ్యపథ్‌లో ఆకట్టుకున్న ప్రత్యేక శకటం

# సత్తా చాటిన సైన్యం కవాతు

- వికసిత భారత్ ఇతివృత్తంగా ఢిల్లీలో గణతంత్ర వేడుకలు
- ముఖ్య అతిథిగా విచ్చేసిన ఇండోనేషియా అధ్యక్షుడు
- ఆకట్టుకున్న సాంస్కృతిక, నృత్యాలు, సైనిక ప్రదర్శనలు
- కనువిందు చేసిన రాష్ట్రాల, శాఖల శకటాలు

న్యూఢిల్లీ, జనవరి 26: దేశ, విదేశాల్లో ఆదివారం 76వ గణతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. దేశ రాజధాని న్యూఢిల్లీలోని కర్తవ్యపథ్‌లో వికసిత్ భారత్ ఇతివృత్తంగా జరిగిన వేడుకలు దేశ సైనిక శక్తిని, సాంస్కృతిక వారసత్వాన్ని, వివిధ రంగాల్లో సాధించిన ప్రగతిని చాటి చెప్పాయి. ఇండోనేషియా అధ్యక్షుడు ప్రబోవో సుబియాంతో ముఖ్య అతిథిగా విచ్చేశారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము తొలుత జాతీయజెండాను ఆవిష్కరించి పరేడ్‌లో పాల్గొన్న త్రివిధ దళాల నుంచి గౌరవ వందనం స్వీకరించారు.

**5 వేల మంది జానపద కళాకారులతో...**

వివిధ ప్రాంతాలకు చెందిన 5 వేల మంది జానపద కళాకారులు తొలిసారిగా వివిధ రాష్ట్రాల సంస్కృతులను ప్రతిబింబించే 45 రకాల నృత్యరీతులను ప్రదర్శించారు. సంగీత నాటక అకాడమీ ఆధ్వర్యంలో 'జయతే జయ మహా భారతం' పేరిట ప్రదర్శించిన 11 నిమిషాల సాంస్కృతిక ప్రదర్శన ఆహూతులను ఆకట్టుకుంది. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన శకటం ఏటికొప్పాక చెక్క బొమ్మల తయారీని వివరించింది. యూపీ శకటం మహా కుంభ మేళా జరిగే విధానాన్ని ఆవిష్కరించింది. మొత్తం 31 శకటాలు మనగొప్పదనాన్ని చాటిచెప్పాయి.



**ఆర్మీ పవర్ చూపిన మిస్సైల్స్**

మన రక్షణ వ్యవస్థ పాటవాన్ని చాటే బ్రహ్మోస్, పినాక, ఆకాశ్ వంటి అత్యాధునిక క్షిపణులు, రాకెట్లను భారత సైన్యం ప్రదర్శించింది. భారత త్రివిధ దళాలు సంయుక్తంగా ఒక శకటాన్ని ప్రదర్శించాయి.'సశక్త్ ఔర్ సురక్షిత్ భారత్' థీమ్‌తో దీనిని తయారు చేశారు.

## నారీ శక్తికి ప్రాతినిధ్యం..



చరిత్రలో తొలిసారిగా 100 మంది మహిళలు శంఖం, నాదస్వరం వంటి సంప్రదాయ సంగీత వాయిద్యాలతో పరేడ్ నిర్వహించారు. ఆర్మీ, నేవీ, ఎయిర్‌ఫోర్స్‌లో నారీ శక్తికి ప్రాతినిధ్యం వహిస్తూ మహిళా అధికారులు పాల్గొన్నారు. డీఆర్‌డీవో నిర్వహించిన కవాతుకు మహిళా శాస్త్రవేత్త సునీతా జెనా నాయకత్వం వహించారు. సీఆర్‌పీఎఫ్‌కు చెందిన 148 మంది మహిళలు, ఆర్పీఎఫ్ బృందం పరేడ్‌లో పాల్గొన్నాయి. రాష్ట్రపతి ముర్ముకు వందనం సమర్పించిన తొలి మహిళా అధికారిగా కెప్టెన్ డింపిల్ సింగ్ భాటి ప్రపంచ రికార్డు నెలకొల్పారు.

# ఉద్యోగం వద్దు.. ఉండనిస్తే చాలు

- అక్రమ వలసదారులపై అమెరికాలో నిశితంగా తనిఖీలు
- అక్కడి భారతీయుల్లో పెరిగిన దేశ బహిష్కరణ భయం
- డాలర్ డ్రీమ్స్ చెదిరి వణికిపోతున్న మన విద్యార్థులు
- డొనాల్డ్ ట్రంప్ రాకతో అంచనాలు, ఆశలు తలకిందులు



వాషింగ్టన్, జనవరి 26: తాను గెలిస్తే అక్రమ వలసదారులను దేశం నుంచి సాగనంపుతానంటూ చేసిన శపథాన్ని అమెరికా కొత్త అధ్యక్షుడు ట్రంప్ నెరవేర్చుకుంటున్నారు. అధ్యక్షునిగా బాధ్యతలు చేపట్టిన వెంటనే ఆయన ఎడాపెడా ఎగ్జిక్యూటివ్ ఆదేశాలపై సంతకాలు పెట్టేస్తుండటంతో పలు వర్గాలకు కష్టాలు ప్రారంభమయ్యాయి. తాము అనుకున్నట్టే అయ్యిందని, ట్రంప్ తిరిగి అధికారంలోకి వస్తే తమకు తిప్పలు తప్పవన్న తమ భయాలు నిజమయ్యాయని వారు వాపోతున్నారు. ముఖ్యంగా అక్రమ వలసదారులపై ట్రంప్ కొరడా ఝుళిపించడంతో ఎక్కడ తమపై ఆ వేటు పడుతుందేమోనని పలువురు విద్యార్థులు సైతం భయంతో వణుకుతున్నారు. భారత్ సహా వివిధ దేశాల విద్యార్థులు అక్కడ చదువుకుంటూ పార్ట్‌టైం ఉద్యోగాలు చేస్తున్నారు. పార్ట్‌టైం ఉద్యోగాలకు సంబంధించి ఆ దేశంలో కఠిన నిబంధనలు ఉన్నా ఇంతవరకు అవి సరిగ్గా అమలు కాలేదు. అయితే ట్రంప్ అధికారం చేపట్టాక వాటిని కఠినంగా అమలు చేస్తుండటంతో పార్ట్ టైం ఉద్యోగాలు చేస్తూ తాము దొరికితే ఎక్కడ డిపోర్టేషన్ (దేశ బహిష్కరణ) చేస్తారోనన్న భయంతో అమెరికాలోని పలువురు భారతీయులు వాటిని చేయడం మానేస్తున్నారు. ఉద్యోగం వద్దు బాబోయ్.. ఇక్కడ ఉండనిస్తే చాలు అన్న ధోరణి వారిలో కన్పిస్తున్నది. నిబంధనల ప్రకారం తగిన పత్రాలు లేనివారు, నిబంధనలకు విరుద్ధంగా పార్ట్ టైమ్ ఉద్యోగాలు చేస్తున్నవారు, గడువు ముగిసినా అమెరికాలోనే అక్రమంగా ఉంటున్నవారిలోనే ఈ భయం ఎక్కువగా ఉంటున్నది.

**తనిఖీల భయం..**

**పార్ట్ టైమ్ జాబ్స్‌కు మంగళం**

'మా తల్లిదండ్రులు అప్పు ఉన్నత విద్య కోసం ఇక్కడకు పంపారు. వారిపై మరింత ఆర్థిక భారం మోపకుండా మేము చదువయ్యాక సాయంత్రాలు చిన్న చిన్న ఉద్యోగాలు చేసుకుంటున్నాం' అని భారత్‌కు చెందిన ఒక విద్యార్థి తెలిపారు. 'పార్ట్ టైం ఉద్యోగాలు చేయకుండా ఇక్కడ మనుగడ చాలా కష్టం.' అని మరో విద్యార్థి వాపోయాడు. 'నా కాలేజీ అయిపోయిన తర్వాత చిన్న కేఫ్‌లో గంటకు ఏడు డాలర్లు (సుమారు రూ.603) సంపాదిస్తున్నా. ఇలా రోజుకు ఆరు గంటలు పనిచేస్తున్నా. దీంతో అవి నా ఖర్చులకు సరిపోతున్నాయి. ఇప్పుడేం చేయాలో అర్థం కావడం లేదు' అని తెలంగాణకు చెందిన ఒక విద్యార్థి తన గోడు వెళ్లబోసుకున్నారు. 'మా అమ్మానాన్నలు రూ.42 లక్షలు అప్పు చేసి ఇక్కడకు పంపారు. ఇక్కడి అధికారులేమో పార్ట్‌టైం ఉద్యోగాలు చేస్తే డిపోర్టేషన్ చేస్తామని అంటున్నారు. అందుకే దానిని మానేశా' అని అక్కడ మాస్టర్స్ చేస్తున్న విద్యార్థి వివరించారు. 'ఇప్పటికే అధికారులు పలు సంస్థల్లో యథేచ్ఛగా తనిఖీలు చేస్తున్నారు. దీంతో భయమేసి నేను, నా స్నేహితులు పార్ట్ టైం ఉద్యోగాలను మానేసాం. రిస్క్ తీసుకుని మా స్టూడెంట్ వీసాలను కోల్పోలేం' అని న్యూయార్క్‌లో ఉన్నత విద్యను అభ్యసిస్తున్న యూపీకి చెందిన విద్యార్థి తెలిపాడు. ప్రస్తుతం 3 లక్షల మంది భారతీయ విద్యార్థులు అమెరికాలోని వివిధ విద్యాసంస్థల్లో చదువుతున్నారు. అదే సమయంలో ఆ అగ్ర దేశంలో 20,407 మంది సరైన పత్రాలే లేకుండా అక్రమంగా నివసిస్తున్నట్టు అధికారిక లెక్కలు చెబుతున్నాయి. వారిలో 2,467 మంది ఇప్పటికే అమెరికా ఇమ్మిగ్రేషన్ అండ్ కస్టమ్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ (ఐసీఈ) శాఖ నిర్బంధంలో ఉన్నారు.

**కఠినంగా నిబంధనలు అమలు**

అమెరికాలో చదువుతున్న చాలామంది విద్యార్థులు ఎఫ్-1 వీసాపై ఉన్నారు. దీని ప్రకారం వారు వారానికి 20 గంటల పాటు పార్ట్‌టైం ఉద్యోగం చేసుకోవచ్చు. అయితే ఆయా క్యాంపస్‌లోనే వారు వాటిని చేయాల్సి ఉంటుంది. దానిని అతిక్రమించితే అమెరికా దౌత్య విధానం ప్రకారం వారిని దేశం నుంచి బయటకు పంపేయవచ్చు. అయితే క్యాంపస్‌లోనే అందరికీ ఉద్యోగాలు లభించవు కాబట్టి అక్కడి విద్యార్థులు రెస్టారెంట్లు, పెట్రోల్ పంప్‌లు, రిటైల్ స్టోర్‌ల్లో అనధికారికంగా పని చేస్తుంటారు. ట్రంప్ అధికారం చేపట్టిన వెంటనే ముందుగా ప్రకటించిన విధంగా శుక్రవారం దేశంలోని వందలాది మంది అక్రమ వలసదారులను మిలిటరీ విమానాల ద్వారా ఆయా దేశాలకు పంపించారు. ఆయన కార్యనిర్వాహక ఉత్తర్వులతో ఎప్పుడు ఎవరిపై వేటు పడుతుందోనని వేలాది మంది బిక్కుబిక్కుమంటున్నారు. జో బైడెన్ అధ్యక్షుడిగా ఉన్న సమయంలో వలసదారులు, శరణార్థులు, ఎఫ్-1 వీసాదారుల పట్ల ఉదారంగా ఉండేవారు. నిబంధనలకు విరుద్ధంగా బయట పార్ట్‌టైం ఉద్యోగాలు చేసుకున్నా పట్టించుకునే వారు కాదు. ట్రంప్ రాకతో నిబంధనలు ఎంత కఠినమయ్యాయంటే.. అమెరికాలో ఉంటున్న తమ కుమారుడి వద్ద ఐదు నెలలు ఉండేందుకు టూరిస్ట్ వీసాపై భారత్‌కు చెందిన తల్లిదండ్రులు న్యూయార్క్‌కు చేరుకున్నారు. అయితే వారి వద్ద రిటర్న్ టికెట్ లేదన్న సాకుతో వారిని దేశంలోకి రానీయకుండా తిరిగి భారత్‌కు పంపేసారు.

**సరిహద్దు ఎమర్జెన్సీతో తగ్గిన వలసదారులు**

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అమలు చేసిన బోర్డర్(సరిహద్దు) ఎమర్జెన్సీ వల్ల అక్రమ వలసలు తగ్గుముఖం పట్టాయి. సరిహద్దు గస్తీ సిబ్బంది ఒక్కొక్క వలసదారుడిని గంటల తరబడి గమనిస్తున్నారు. శాన్ డియాగో, ఎల్ పాసోలలో 1,500 మంది సైనికులను మోహరించారు. 2023 డిసెంబరులో అమెరికాలోకి 2.5 లక్షల మంది అక్రమంగా వలస వచ్చారు. ఈ సంఖ్య గత డిసెంబరులో దాదాపు 47 వేలకు తగ్గిపోయింది.

# పట్టు వీడని రైతన్నలు

## డిమాండ్ల సాధనకు ట్రాక్టర్ ర్యాలీలు

న్యూఢిల్లీ, జనవరి 26: పంటలకు అందచేసే కనీస మద్దతు ధరపై చట్టబద్ధమైన హామీని ఇవ్వడంతో సహా వివిధ డిమాండ్లను పునరుద్ఘాటిస్తూ దేశ వ్యాప్తంగా వివిధ రాష్ట్రాల్లో రైతులు ఆదివారం ట్రాక్టర్ ర్యాలీలు నిర్వహించారు. రైతుల ఐక్య వేదిక సంయుక్త కిసాన్ మోర్చా(ఎస్‌కేఎం) ఇచ్చిన పిలుపులో భాగంగా ఈ ర్యాలీలు జరిగాయి. పంజాబ్, హర్యానాలలో ఈ ర్యాలీలు ఉధృతంగా సాగాయి. తమ డిమాండ్ల సాధన కోసం రైతులు 2024 ఫిబ్రవరి 13 నుంచి ఎస్‌కేఎం(రాజకీయేతర), కిసాన్ మజ్దూర్ మోర్చా(కేఎంఎం) ఛత్రం కింద పంజాబ్-హర్యానా సరిహద్దులోని ఖనౌరీ వద్ద ఆందోళన చేస్తున్నారు. రైతులు నిర్వహించిన ట్రాక్టర్ ర్యాలీలపై రైతు నాయకుడు సర్వన్ సింగ్ పంధేర్ చండీగఢ్‌లో మాట్లాడుతూ రైతులు, కార్మికుల అభిప్రాయాలను, వారి డిమాండ్లను కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం గౌరవించడం లేదని ఆరోపించారు. తమ డిమాండ్లను కేంద్రం నెరవేర్చని పక్షంలో ఢిల్లీ సరిహద్దుల్లో 2020-21లోజరిగిన ఆందోళనల కన్నా ఉధృతంగా దేశవ్యాప్తంగా నిర్వహిస్తామని ఎస్‌కేఎం హెచ్చరించింది.



అమృత్‌సర్‌లో రైతులు చేపట్టిన భారీ ట్రాక్టర్ ర్యాలీ

## ఆ ఊళ్లో తొలిసారి రిపబ్లిక్ డే

### నక్సల్స్ ప్రభావిత పల్లెలో గ్రామస్థుల సంబరం

న్యూఢిల్లీ, జనవరి 26: దేశం యావత్తు జనవరి 26 వేడుకల్ని ఘనంగా జరుపుకుంది. అయితే ఛత్తీస్‌గఢ్‌లోని ఓ గ్రామ ప్రజల ఆనందం అంతా ఇంతా కాదు. ఎందుకంటే దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత ఆ గ్రామంలో తొలిసారి జాతీయ పతాకం ఎగిరింది. సుక్మా జిల్లా తుముల్‌పాడ్ గ్రామం, దాని చుట్టుపక్కల ప్రాంతాల్లో భారత్ మాతాకీ జై, జై హింద్.. అంటూ పిల్లలు, పెద్దలు, యువకులు నినాదాలు చేశారు. సంతోషంతో స్వీట్లు పంచుకున్నారు. ప్రభుత్వ అధికారులు చొరవ తీసుకోగా, సీఆర్‌పీఎఫ్ నేతృత్వంలో గ్రామస్తులు జాతీయ పతాకాన్ని ఎగురవేశారు.

## దక్షిణ కొరియా అధ్యక్షుడిపై నేరాభియోగాలు

సియోల్ : అభిశంసనకు గురైన దక్షిణ కొరియా అధ్యక్షుడు యూన్ సుక్ యోల్‌పై నేరాభియోగాలను ఆదివారం ప్రాసిక్యూటర్లు నమోదు చేశారు. గత ఏడాది డిసెంబరు 3న 6 గంటలపాటు ఆయన దేశంలో మార్షల్ లా విధించి, తిరుగుబాటుకు పాల్పడినట్లు ఈ కేసులో పేర్కొన్నారు. ఈ నేరారోపణలు రుజువైతే ఆయనకు మరణ శిక్ష లేదా యావజ్జీవ కారాగారవాస శిక్ష పడవచ్చు. మార్షల్ లా విధించిన తర్వాత యూన్‌ను పార్లమెంటు అభిశంసించింది. ఆ తర్వాత ఆయనను అరెస్ట్ చేశారు. ఆయనను తిరిగి దేశాధ్యక్షునిగా పునరుద్ధరించాలా? లేక డిస్మిస్ చేయాలా? అనే అంశాన్ని రాజ్యాంగ న్యాయస్థానం పరిశీలిస్తున్నది. మరోవైపు క్రిమినల్ జ్యుడిషియల్ ప్రొసీడింగ్స్ కొనసాగుతున్నాయి. అయితే పరిపాలనలో భాగంగానే తాను చట్టబద్ధంగా మార్షల్ లా విధించానని యూన్ తెలిపారు.

## ప్రముఖ వైద్యుడు చెరియన్ కన్నుమూత

### భారత్‌లో బైపాస్ గ్రాఫ్ట్ సర్జరీ చేసిన తొలి సర్జన్

చెన్నై: ప్రముఖ గుండె శస్త్ర చికిత్స నిపుణుడు కేఎం చెరియన్(80) కన్నుమూశారు. శనివారం బెంగళూరులో ఓ ఫంక్షన్‌కు హాజరైన ఆయన కుప్పకూలి చనిపోయారు. దేశంలో 50 ఏండ్ల క్రితం గుండెకు తొలి కరోనరీ ఆర్టరీ బైపాస్ గ్రాఫ్ట్ (ధమనుకు సంబంధించిన సర్జరీ) చేసిన వైద్యుడిగా చెరియన్ ఘనత సాధించారు. చెరియన్ మృతి తీరని విషాదమని భారత గుండె శస్త్ర చికిత్స నిపుణుల మండలి అధ్యక్షుడు రాజేశ్ రాజన్ తెలిపారు. వైద్య రంగంలో భవిష్యత్తు ఆవిష్కరణలపై చెరియన్‌తో ఇటీవలే చర్చించానని డబ్ల్యూహెచ్‌వో మాజీ శాస్త్రవేత్త సౌమ్య స్వామినాథన్ ఆవేదన వ్యక్తం చేశారు.

## రేబిస్ మరణాల కట్టడిలో మనమెక్కడ?

### జంతువుల కాట్లలో మూడొంతులు కుక్క కాట్లే

ఢిల్లీ : దేశంలో జంతువుల కాట్ల వల్ల ఏటా సగటున 5726 మంది మరణిస్తున్నారు. ఇందులో 76.8 శాతం కుక్క కాట్లేనని తేలింది. ది లాన్సెట్ ఇన్ఫెక్షియస్ డిసీజెస్ జర్నల్ అధ్యయన వివరాలను ప్రచురించింది. ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్-ఐసీఎంఆర్ దేశవ్యాప్తంగా 2022 మార్చిలో 15 రాష్ట్రాల పరిధిలోని 3.37లక్షల మందిని సర్వేలో ప్రశ్నించింది. జంతువుల కాట్లు, యాంటీ రేబిస్ వ్యాక్సినేషన్ అందుబాటు, మరణాలపై వివరాలు సేకరించింది. సర్వేలో పాల్గొన్న వాళ్లలోనూ 2000 మంది జంతువుల కాట్లకు గురైన వాళ్లున్నారని, వారిలో 76.8శాతం కుక్క కాటు బాధితులని గుర్తించారు.

## త్వరలో విద్యార్థుల పార్టీ!

### బంగ్లాదేశ్ రాజకీయ పార్టీల్లో భయం

ఢాకా: త్వరలో కొత్త రాజకీయ శక్తి ఆవిర్భవించనుండడంతో బంగ్లాదేశ్‌లోని ప్రధాన రాజకీయ పార్టీలు ఆందోళన చెందుతున్నాయి. కొత్తగా ఏర్పడనున్న విద్యార్థుల రాజకీయ పార్టీతో వచ్చే పార్లమెంట్ ఎన్నికలలో తమ విజయావకాశాలు దెబ్బ తింటాయేమోనని ప్రధాన ప్రతిపక్షం బంగ్లాదేశ్ నేషనలిస్టు పార్టీ(బీఎన్‌పీ) కలవరపడుతోంది. బంగ్లాదేశ్ మాజీ ప్రధాని షేక్ హసీనా నేతృత్వంలోని అవామీ లీగ్ ప్రభుత్వ పతనానికి కారణమైన విద్యార్థి ఉద్యమానికి సారథ్యం వహించిన యాంటీ డిస్క్రిమినేషన్ స్టూడెంట్స్ మూవ్‌మెంట్ ఫిబ్రవరిలో కొత్త రాజకీయ పార్టీగా మారనుంది.



## సముద్రంలో ఎగిరిన త్రివర్ణ పతాకం

### ద్వారకలో వినూత్నంగా రిపబ్లిక్ డే

గాంధీనగర్, జనవరి 26: దేశవ్యాప్తంగాగణతంత్ర దినోత్సవ వేడుకలు..నింగి, నేల, నీరు వేదికలుగా జరిగాయి. గుజరాత్‌లోని ద్వారక తీరంలోని స్కూబా డైవర్లు భారత గణతంత్ర దినోత్సవ వేడుకల్ని వినూత్నంగా నిర్వహించారు. సముద్రం లోపల 30 మీటర్ల లోతులో మువ్వన్నెల జెండాను ఎగురవేశారు.గణతంత్ర దినోత్సవ వేడుకల్ని అందరూ గుర్తుంచుకునే విధంగా..విలక్షణ శైలిలో జరుపుకున్నారు. ద్వారక తీర ప్రాంతానికి చెందిన స్కూబా డైవర్ల బృందం అత్యంత సాహసోపేతంగా సముద్రం నీటిలో జాతీయ పతాకాన్ని ఎగురవేయటం అందర్నీ ఆకట్టుకుంది.

# పరీక్ష హాల్లోకి ఎలక్ట్రానిక్ పరికరాలొద్దు

### వాడినా, వాడకున్నా దొరికితే రెండేండ్లు డిబార్: సీబీఎస్ఈ



న్యూఢిల్లీ, జనవరి 26: నిషేధిత ఎలక్ట్రానిక్ కమ్యూనికేషన్ పరికరాలను పరీక్ష హాలుకు తీసుకువెళుతున్నట్టు గుర్తించిన విద్యార్థులను రెండేండ్ల పాటు బోర్డు పరీక్షలు రాయకుండా డిబార్ చేస్తామని సెంట్రల్ బోర్డు ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్(సీబీఎస్ఈ) ప్రకటించింది. పరీక్షల సందర్భంగా అక్రమాలకు జరగకుండా కఠినమైన విధానాన్ని అమలు చేస్తున్నామని ఓ నోటిఫికేషన్‌లో పేర్కొంది. మొబైల్ ఫోన్లు, స్మార్ట్ వాచీలు లేదా ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలతో పరీక్ష హాలులో దొరికిపోయిన విద్యార్థులు తక్షణ చర్యలు ఎదుర్కొంటారని, అన్ని సబ్జెక్టులలో వారి పరీక్షలను ఈ సంవత్సరంతో పాటు వచ్చే సంవత్సరం కూడా రద్దు చేస్తామని సీబీఎస్ఈ తెలిపింది. అడ్మిట్ కార్డులు, పెన్నులు, అనలాగ్ వాచీలు వంటి అనుమతించిన జాబితాలోని వస్తువులను మాత్రమే విద్యార్థులు తీసుకురావాల్సి ఉంటుందని బోర్డు తెలిపింది. ఉల్లంఘనలను నివారించడానికి పరీక్షా సెంటర్ల వద్ద భౌతిక తనిఖీ ప్రక్రియ సమగ్రంగా ఉంటుందని కూడా బోర్డు వెల్లడించింది. అంతేగాక పరీక్షకు సంబంధించిన వదంతులను సోషల్ మీడియాలో వ్యాప్తి చేయకూడదని బోర్డు హెచ్చరించింది. పరీక్షకు సంబంధించిన అసలు లేదా నకిలీ సమాచారాన్ని షేర్ చేసిన విద్యార్థులు శిక్ష ఎదుర్కోక తప్పదని చెప్పింది. ఫిబ్రవరి 15 నుంచి సీబీఎస్ఈకి చెందిన 10, 11వ తరగతి పరీక్షలు ప్రారంభం కానున్న నేపథ్యంలో ఈ నోటిఫికేషన్ విడుదలైంది.

**ప్రాథమిక గుర్తింపుగా అపార్ ఐడీ**


విద్యార్థులకు ప్రాథమిక గుర్తింపు విధానంగా ఆటోమేటెడ్ పర్మనెంట్ అకడమిక్ అకౌంట్ రిజిస్ట్రీ (అపార్) ఐడీని అమలు చేయాలని సీబీఎస్ఈ పాఠశాలలకు తెలిపింది. ఈ ఐడీలో 12 అంకెల గుర్తింపు సంఖ్య ఉంటుంది. విద్యార్థుల విద్యా, ఇతర అంశాలకు సంబంధించిన రికార్డులను ఒకే చోట డిజిటల్ ప్లాట్‌ఫాంపై భద్రపరచడం దీని ఉద్దేశం.

## కుంభమేళా అపరిశుభ్రం కాగలదు!

### కాంగ్రెస్ మాజీ ఎంపీ వివాదాస్పద వ్యాఖ్యలు

న్యూఢిల్లీ, జనవరి 26: కోట్లాది మంది హిందువులు పరమ పవిత్రంగా భావించే మహా కుంభమేళాపై కాంగ్రెస్ నాయకుడు, రాజ్యసభ మాజీ ఎంపీ హుస్సేన్ ధల్వాయి మరోసారి నోరు పారేసుకుని వివాదం సృష్టించారు. పుణ్యస్నానం ఆచరించేందుకు దేశ నలుమూలల నుంచి ప్రజలు రావడం వల్ల మహా కుంభమేళా అపరిశుభ్రంగా మారగలదని ఆయన వ్యాఖ్యానించారు. ఆరోగ్యానికి సంబంధించిన పరీక్షలేవీ నిర్వహించక పోవడం వల్ల వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని హెచ్చరించారు. స్నానాల కోసం కూడా తగిన ఏర్పాట్లు చేసి ఉండాల్సిందని ఆయన చెప్పారు. వైద్య పరీక్షలు లేకుండా సామూహిక పుణ్యస్నానాలు చేయడం వల్ల ఆరోగ్యంగానే ఉన్న వ్యక్తులకు కూడా వ్యాధులు సోకే అవకాశం ఉందని ఆయన అన్నారు. హుస్సేన్ వ్యాఖ్యలపై బీజేపీ ప్రతినిధి షెహజాద్ పూనావాలా అభ్యంతరం వ్యక్తం చేశారు.

# గూగుల్ క్రోమ్ యూజర్లకు కేంద్రం హెచ్చరిక




న్యూఢిల్లీ, జనవరి 26: గూగుల్ క్రోమ్ ఇంజిన్ వాడుతున్న మాక్ యూజర్లకు కేంద్ర ప్రభుత్వం హెచ్చరికలు జారీ చేసింది. గూగుల్ క్రోమ్‌లో రెండు తీవ్రస్థాయి లోపాలు ఉన్నాయని, అవి హ్యాకర్లకు అవకాశంగా మారే ప్రమాదం ఉందని కేంద్ర ప్రభుత్వంలో నడిచే కంప్యూటర్ ఎమర్జెన్సీ రెస్పాన్స్ టీమ్(సీఈఆర్‌టీ) ఆదివారం పేర్కొంది. పీసీలు, ల్యాప్‌టాప్ విండోస్ ఆపరేటింగ్ సిస్టమ్ యూజర్లతోపాటు మాక్ యూజర్లు కూడా అప్రమత్తంగా ఉండాలని సీఈఆర్‌టీ సూచించింది. స్మార్ట్ ఫోన్ యూజర్లకు దాంతో పెద్దగా నష్టం ఉండకపోవచ్చని తెలిపింది. గూగుల్ క్రోమ్‌లోని లోపాలతో ఆయా కంప్యూటర్లు హ్యాకర్ల బారినపడే ప్రమాదం ఉంటుందని, దాంతో సమాచారాన్ని తస్కరించే అవకాశాలుంటాయని హెచ్చరించింది. హ్యాకర్ల నుంచి తప్పించుకునేందుకు యూజర్లు తప్పనిసరిగా గూగుల్ క్రోమ్‌ని అప్‌డేట్ చేయాలని సూచించింది.

## ఉత్తరాదివారికి బెంగళూరులో నో ఎంట్రీ!


### కన్నడ రాని పొరుగు రాష్ట్రాలవాళ్లకు కూడా.. సోషల్ మీడియాలో పోస్ట్‌పై విస్తృత చర్చ

బెంగళూరు: కన్నడ భాష ఉద్యమం మరోసారి తెరపైకి వచ్చింది. ఈ సారి సోషల్ మీడియా వేదికగా చర్చనీయాంశమైంది. కన్నడ నేర్చుకునేందుకు ఇష్టపడనివారికి బెంగళూరు దారులు మూసుకుపోయాయని ఓ యూజర్ ఎక్స్‌లో చేసిన పోస్టు తాజాగా వైరలైంది. 'కన్నడ భాష నేర్చుకోవడానికి ఇష్టపడని ఉత్తరాదివారు, పొరుగు రాష్ట్రాల ప్రజలకు బెంగళూరు దారులు మూసుకుపోయాయి' అని బభ్రువాహన అనే యూజర్ చేసిన ట్వీట్ నెట్టింట చర్చకు దారితీసింది. సోషల్ మీడియా వేదికగా కన్నడ, కన్నడేతరుల మధ్య అగ్గి రాజేసింది.

## తల్లి ఎక్స్ క్రోమోజోములతోనే అల్జీమర్స్!

- మెదడు వృద్ధాప్యానికి అదే కారణం
- అధ్యయనంలో పరిశోధకుల వెల్లడి

ఢిల్లీ, జనవరి 26: మెదడు వయసు పెరగడం, వృద్ధాప్యానికి గల కారణాలను పరిశోధకులు కనుగొన్నారు. తల్లి నుంచి బిడ్డలకు సంక్రమించే 'ఎక్స్' క్రోమోజోముల(ఒక కణం నుంచి మరో కణానికి జన్యు సమాచారాన్ని తీసుకెళ్లే దారం లాంటి సూక్ష్మ నిర్మాణాలు) కారణంగానే మెదడు వృద్ధాప్యం చెందుతుందని, దీని ప్రభావం మూలంగానే అల్జీమర్స్(మతిమరుపు) కూడా వచ్చే ప్రమాదం పెరుగుతుందని ఒక అధ్యయనంలో వెల్లడైంది. సాధారణంగా మహిళల్లో రెండు 'ఎక్స్' క్రోమోజోములు ఉంటాయి. పురుషుల్లో మాత్రం 'ఎక్స్', 'వై' అనే రెండు వేర్వేరు క్రోమోజోములు ఉంటాయి. సహజంగా ఎక్స్ క్రోమోజోముల్లో జన్యు పదార్థాలు ఉంటాయి. ఇందులో జరిగే మ్యుటేషన్లు తీవ్ర ప్రభావాలను చూపుతాయి. ముఖ్యంగా మహిళల్లో ప్రతి కణంలోనూ రెండు క్రోమోజోముల్లో ఏదో ఒకటి డియాక్టివేటెడ్ స్థితిలో ఉంటుంది. ఇదే అనేక ప్రభావాలకు దారితీస్తుంది. అయితే అల్జీమర్స్ మహిళలపై ఎక్కువగా ప్రభావం చూపుతుంది. అయితే ఈ వ్యాధి సంక్రమించినప్పటికీ పురుషులతో పోలిస్తే మహిళలే ఎక్కువ కాలం జీవిస్తారని పలు అధ్యయనాలు వెల్లడించాయి.



**హిప్పో క్యాంపస్‌పై ప్రభావం**

అధ్యయనంలో భాగంగా వివిధ వయస్సులు గల ఎలుకలపై పరిశోధకులు ప్రయోగం చేశారు. మెదడులోని హిప్పోక్యాంపస్ (నేర్చుకోవడం, జ్ఞాపకశక్తి) అనే ప్రాంతంలో తల్లి ఎక్స్ క్రోమోజోములు చూపిన ప్రభావం కారణంగా మెదడు వృద్ధాప్యానికి దారితీసే జీవసంబంధమైన మార్పులు జరిగినట్టు పరిశోధకులు గుర్తించారు. కాలక్రమంలో ఇదే అల్జీమర్స్‌కు దారితీస్తుందని పరిశోధకులు తేల్చారు. తల్లి నుంచి ఎక్కువగా ఎక్స్ క్రోమోజోములు సంక్రమించే మహిళల్లో అల్జీమర్స్ వ్యాధి ప్రభావం అధికంగా ఉంటుందని అధ్యయనానికి నేతృత్వం వహించిన సేన డుబల్ తెలిపారు. ఈ అధ్యయనం ఎలుకలపై జరిగినప్పటికీ, మానవులకు అన్వయించుకోవచ్చని పరిశోధకులు వెల్లడించారు.

## విడిపోయిన దంపతుల పిల్లలకు స్ట్రోక్ ముప్పు!

### తాజా అధ్యయనంలో వెల్లడి

న్యూఢిల్లీ, జనవరి 26: మానసిక ఒత్తిడి, ఒంటరితనం..ఇవి ఓ వ్యక్తి బ్రెయిన్ 'స్ట్రోక్' బారినపడే ముప్పును పెంచుతాయి. ఇవే కాకుండా..విడాకులు తీసుకున్న తల్లిదండ్రుల పిల్లలకు కూడా 'స్ట్రోక్' వచ్చే అవకాశం ఎక్కువగా ఉంటుందని తాజా అధ్యయనం ఒకటి తేల్చింది. యూనివర్సిటీ ఆఫ్ టొరొంటో సైంటిస్టులు 65 ఏండ్ల పైబడ్డ 13 వేల మంది నుంచి డాటాను సేకరించి ఓ నివేదికను తయారుచేశారు. దీని ప్రకారం, ఓ వ్యక్తి స్ట్రోక్ బారిన పడటానికి తల్లిదండ్రుల విడాకులకు సంబంధముంది. తల్లిదండ్రులు విడిపోవటమన్నది పిల్లల వయస్సు 18 ఏండ్ల దాటకముందే జరిగితే, అలాంటి కుటుంబాల్లోని పిల్లలు పెరిగి పెద్దవాళ్లయ్యాక...60 శాతం మందికి స్ట్రోక్ వచ్చే ప్రమాదముంది. తల్లిదండ్రులతో కలిసి జీవిస్తున్న పిల్లలతో పోల్చితే విడిపోయిన కుటుంబాల్లో వృద్ధులు ఎక్కువగా బ్రెయిన్ స్ట్రోక్ బారిన పడుతున్నారు.

## రోబోటిక్ శునకాలు.. హృదయం గెలిచెనే

- కోల్‌కతా రిపబ్లిక్ డేలో కవాతు
- భారత సైన్యానికి విశిష్ట సేవలు



కోల్‌కతా, జనవరి 26: కోల్‌కతాలో ఆదివారం జరిగిన గణతంత్ర దినోత్సవ పరేడ్‌లో సైనిక దళానికి చెందిన రోబోటిక్ శునకాలు 'మ్యూల్' (మల్టీ యుటిలిటీ లెగ్డ్ ఎక్విప్‌మెంట్) క్రమశిక్షణతో కవాతు చేసి అందరి హృదయాలను గెలుచుకున్నాయి. 'సంజయ్' అని నామకరణం చేసిన ఈ రోబో శునకాలు మెట్లు, కొండలు ఎక్కడం, అడ్డంకులను దాటుకుని వెళ్లడం సహా అన్ని రకాల వాతావరణ పరిస్థితుల్లోనూ పనిచేయగలవు. పెరిమీటర్ సెక్యూరిటీ, ఆస్తుల రక్షణ, పేలుడు పదార్థాలను గుర్తించడం, నిర్వీర్యం చేయడం, నిఘా లాంటి కార్యకలాపాలను నిర్వహించగలదని సైన్యం వెల్లడించింది. మైనస్ 40 నుంచి 55 సెల్సియస్ డిగ్రీల ఉష్ణోగ్రతలుండే అత్యంత ప్రతికూల ప్రాంతాల్లో సైతం పని చేయగలిగే ఈ రోబో శునకాలు 15 కిలోల బరువును సైతం మోసుకెళ్లగలదని, భారత సైనిక దళానికి చెందిన వివిధ యూనిట్లలో ఇప్పటివరకు దాదాపు 100 రోబో శునకాలను మోహరించామని అధికారులు తెలిపారు.

## వర్షాలు కురిసినా లాభం లేదు!

### విష పదార్థాలు కొట్టుకొస్తాయని లాస్ ఏంజెల్స్ వాసుల్లో ఆందోళన

న్యూయార్క్: అమెరికాలోని కార్చిచ్చు ప్రభావిత ప్రాంతాల్లో వర్షాలు కురుస్తాయనే వార్త ప్రజలకు సంతోషాన్ని ఇవ్వడం లేదు. లాస్ ఏంజెల్స్ కౌంటీలో కొన్ని ప్రాంతాల్లో ఇప్పటికీ కార్చిచ్చు కొనసాగుతుండగా, శనివారం నుంచి మొదలైన కొద్దిపాటి వర్షం వల్ల ప్రజలకు మేలు జరుగుతుందా? కీడు జరుగుతుందా? అనే ఆందోళన తీవ్రమవుతున్నది. ఈ వారాంతంలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని నేషనల్ వెదర్ సర్వీస్ ప్రకటించింది. వర్షం నెమ్మదిగా, నిలకడగా కురిస్తేనే ఈ ప్రాంతానికి ప్రయోజనకరమని అధికారులు చెప్తున్నారు. కుండపోత వర్షాలు కురిస్తే, ఒకేసారి వరదలు వస్తాయని, ఫలితంగా విషపూరిత రసాయన పదార్థాలు కొండ దిగువ ప్రాంతాలకు కొట్టుకొస్తాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

## సముద్రం లోపల 120 రోజులు కాలక్షేపం

### జర్మన్ ఏరోస్పేస్ ఇంజనీర్ గిన్నిస్ రికార్డు

పర్టో లిండో, జనవరి 26: ఎటువంటి ఒత్తిడి లేకుండా సముద్రం అడుగున ఓ క్యాప్సూల్‌లో 120 రోజులు గడిపి గిన్నిస్ వరల్డ్ రికార్డును సాధించాడు ఓ జర్మనీ ఏరోస్పేస్ ఇంజనీర్. అత్యధిక కాలం నీటి అడుగున ఎటువంటి ఒత్తిడి లేకుండా జీవించిన వ్యక్తిగా 59 ఏండ్ల రుడిగర్ కోచ్ ప్రపంచ రికార్డును సాధించాడు. సముద్రంలో మునిగిపోయిన ఓ 320 చదరపు అడుగుల క్యాప్సూల్‌నే ఇల్లుగా మలచుకుని 120 రోజులు అందులో గడిపిన కోచ్ శుక్రవారం గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్ ప్రతినిధి సుసానా రేయెస్ సమక్షంలో సంపూర్ణ ఆరోగ్యంతో, ఉల్లాసంగా బయటకు వచ్చాడు.

